క్లుప్తంగా

మట్టి తరలింపుపై సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం రూరల్: గరుసు మట్టిని అక్రమంగా తరలిస్తుండడంపై అధికారులు సీరియస్ అయ్యారు. 'పేట్రేగుతున్న మట్టి మాఫియా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు బుధవారం హుటాహుటిన చెరువులు, వంకల వద్దకు వెళ్లి మట్టి తరలింపును పరిశీలించారు. అయితే ఈ విషయాన్ని ముందే పసిగట్టిన అక్రమార్కులు యంత్రాలు, టిప్పర్లు, ట్రాక్టర్లను అక్కడ నుంచి మరొక చోటికి తరలించారు. మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలను జారీ చేశారు. మట్టిని తరలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

తోపుదుర్తిని విమర్శించే అర్హత కందికుంటకు లేదు

పుట్టపర్తి టౌన్: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని విమర్శించే అర్హత కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌కు లేదని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిల్లే మంజునాథ్, వైఎస్సార్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఉచితంగా బోర్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు తదితర ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేశారని గుర్తు చేశారు. అదే కందికుంట.. కంది చేనుకు ఎక్కువ.. కందిపప్పునకు తక్కువ, చెక్‌బౌన్స్ నిందితుడు అంటూ ఎద్దేవా చేశారు. నోరు అదుపులోపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. నియోజకవర్గంలో జరుగుతున్న విషయాల గురించి ప్రశ్నించి, నిజాలు మాట్లాడితే నీకు ఉలుకెందుకు అని కందికుంటకు చురకలంటించారు.

భద్రత పటిష్టం చేయాలి

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి విమానాశ్రయంలో భద్రత పటిష్టం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. బుధవారం విమానాశ్రయ అధికారులతో కలసి ఏర్పాటు చేసిన భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో విమానాశ్రయానికి వీఐపీలూ, వీవీఐపీలు అధికంగా వస్తుంటారని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుని భద్రత విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఫైర్, బీఎస్ఎన్ఎల్ , విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంతో వైద్య విద్య భారం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- విజయంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు



పుట్టపర్తిలో కోటిసంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకొస్తే పేద, మధ్య తరగతి వర్గాల వారికి వైద్య విద్యనభ్యసించడం భారమవుతుందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు వెల్లడించారు. కోటి సంతకాల కార్యక్రమ పోస్టర్లను బుధవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు వైద్యవిద్యనభ్యసించడానికి, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడానికి గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారన్నారు. అందులో భాగంగా పలు కళాశాలలు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారన్నారు. మిగిలిన కళాశాలల నిర్మాణం పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. నిర్వహణ కష్టమంటూ పీపీపీ విధానం తీసుకురావడం సిగ్గుచేటన్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ప్రభుత్వ వైద్య కళాశాలలు వెళితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ.. వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు 'రచ్చబండ', కోటి సంతకాల సేకరణ

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నల్లమాడ మండలంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉదయం 7–30 గంటలకు చారుపల్లి, 9–30కు యర్రవంకపల్లి, 11–30కు రెడ్డిపల్లి, మధ్యాహ్నం 3 గంటలకు వేళ్లమద్ది, కొండకింద తండా, సాయంత్రం 5 గంటలకు నల్లసింగయ్యగారిపల్లిలో 'రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు ఉంటాయి.

ప్రతి విద్యార్థి సీపీఆర్ నేర్చుకోవాలి

ధర్మవరం అర్బన్: ఆపద సమయాల్లో మనిషి ప్రాణాలు రక్షించేందుకు ఉపయోగపడే సీపీఆర్‌ను ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ షాహిద్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున సూచించారు. పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లోనున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటు వస్తే సీపీఆర్ ఏవిధంగా చేయాలో డాక్టర్ షాహిద్ మనిషి బొమ్మ ద్వారా విద్యార్థినులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

నిబంధనలు పాటించాలి

ఎన్పీకుంట : దీపావళి సందర్భంగా మండల కేంద్రంలో బాణసంచ దుకాణాలు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ సూచించారు. బుధవారం సాయత్రం బాణసంచ దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం సోలార్ ప్రాజెక్టు భూ సేకరణ విషయమై తహసీల్దార్‌తో చర్చించారు. సోమరాజు కుంట సమీపంలోని నెమళ్లగుట్ట వద్ద క్రషర్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, వీఆర్‌ఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిమర్రిలో 'రచ్చబండ'

తాడిమర్రి: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

సంక్షిప్త సమాచారం

అధ్యక్షతన 'రచ్చబండ' నిర్వహించనున్నట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేడు కోటి సంతకాల సేకరణ

తలుపుల: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో పెద్దన్నవారిపల్లి, గుండువారిపల్లి, వేపమానిపేట, బండ్లపల్లి, నూతనకాల్వ గ్రామాల్లో సంతకాల సేకరణతో పాటు రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముదిగుబ్బ: అడవి బ్రాహ్మణపల్లిలో భూక్యా లక్ష్మనాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సోము సుందర్ నాయక్ (త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్) ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనుమతుల్లేని పాఠశాలలు సీజ్ చేయాలి

గాండ్లపెంట: రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను సీజ్ చేసి, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కదిరి ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించేలా చూడాలని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కనగానపల్లి: దాదులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చెన్నేకొత్తపల్లికి చెందిన గోపాల్ మంగళవారం రాత్రి దాదులూరు వైపు బైక్‌పై వస్తుండగా... గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గోపాల్ తలపగిలి తీవ్ర రక్తస్రావమైంది. అనంతపురంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గోపాల్ కోమాలోకి వెళ్లాడని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రామగిరి: స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలకు 950575 7136, 63630 39978 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుంటిమద్ది విద్యార్థులు

రామగిరి: కుంటిమద్ది సదానంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ఓబలేష్ బుధవారం తెలిపారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీటీ మైదానంలో మంగళవారం జరిగిన అండర్–19 హాకీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లో కుంటిమద్ది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు లక్ష్మి, అంకిత, స్వాతి ఎంపిక కాగా, సాఫ్ట్‌బాల్ పోటీల్లో మోక్షిత, లక్ష్మి ఎంపికయ్యారన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం ధర్మవరం కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీమ్, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్ మాట్లాడుతూ రాయలసీమలో హై కోర్టు ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా న్యాయవాదులు ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. రాయలసీమ ప్రాంతవాసులు హైకోర్టుకు వెళ్లాలంటే చాలా దూరంలో ఉన్న విజయవాడకు వెళ్లడం ఇబ్బందికరంగా ఉందన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయకపోతే నిరాహార దీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కలాం అడుగుజాడల్లో నడవాలి



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

ధర్మవరం: పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో బుధవారం వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుల ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్ మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు అబ్దుల్ కలాం అని అన్నారు. భారతదేశ మిసైల్ మ్యాన్‌గా పేరుపొందిన 'భారతరత్న' అబ్దుల్ కలాం అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం బత్తలపల్లి మండల అధ్యక్షులు చైతన్యరెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, నాగార్జున, దాదు, హుస్సేన్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలాం ఆశయ సాధనకు కృషి



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పాటుపడాలని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ సూచించారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని కాకతీయ పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కాలేజీ సర్కిల్‌లోనున్న కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎంపీటీసీ కొండమ్మ మృతి



కొండమ్మ (ఫైల్)

తలుపుల: ఓబులరెడ్డిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ పి.కొండమ్మ (65) బుధవారం మృతి చెందారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

నల్లచెరువు: కనిపించకుండా పోయిన ముగ్గురు బాలికల ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు.. నల్లచెరువుకు చెందిన ఓ బాలికతో పాటు మరో గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలికలు తమకు ట్యూషన్ ఉందని ఇంట్లో చెప్పి ఆ తర్వాత కనిపించకుండా పోయారు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ మక్బూల్ బాషా ప్రత్యేక చొరవ తీసుకుని బాలికల కదలికలపై స్నేహితులతో ఆరా తీశారు. బాలికలు ఆర్టీసీ బస్సులో మొలకలచెరువు మీదుగా అనంతపురం వెళ్లినట్లు నిర్ధారించుకుని అక్కడి పోలీసుల సాయంతో ఆధీనంలో తీసుకుని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.

కోరంలేక సమావేశం వాయిదా

కనగానపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. తదుపరి సమావేశ తేదీ త్వరలో వెల్లడిస్తామని ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. చేసేదిలేక ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులు, టీడీపీ ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.